పిచ్చుకలను కాపాడుకుందాం

విశాలాంధ్ర - భీమిలి: పిచ్చుకలు ఆహారంగా తినే చిన్న కీటకాలు, క్రిములు వలన జీవవైవిధ్య సమతుల్యత సాధ్యమవుతుందని, పిచ్చుకలను కాపాడుకోవాలని డైట్ అధ్యాపకుడు గొట్టేటి రవి అన్నారు. జిల్లా విద్యా శిక్షణ సంస్థ భీమునిపట్నంలో బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 వరకూ జాతులు గల పిచ్చుకలు పక్షుల్లో చిన్నవిగా ఉంటాయన్నారు. ఛాత్రోపాధ్యాయుని రితీషా మాట్లాడుతూ అంతరిస్తున్న పచ్చదనం, రసాయనాల వినియోగం మితిమీరడంవలన పిచ్చుకల జాతికి అంతరించిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సారిపల్లి త్రినాధరావు, ఎం.మహాలక్ష్మి, జే.మాధవి తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా భారీ షాపుల నిర్మాణం

ఓవైపు గెడ్డ... మరోవైపు జాతీయ రహదారి

జోనల్ కార్యాలయానికి కూత వేటు దూరంలో అక్రమ నిర్మాణం

విశాలాంధ్ర - పీఎం పాలెం: జీవీఎంసీ జోన్ 2 మధురవాడలో 6వ వార్డు పరిధి వల్లి నగర్‌లో అనుమతులకు విరుద్ధంగా కమర్షియల్ షాపుల నిర్మాణాలు జరుగుతున్నా ప్లానింగ్ సెక్రటరీ, టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. వల్లి నగర్‌లో హైవేకి పక్కన ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని నిబంధనలు ఉన్న పట్టించుకోకుండా పక్కా కమర్షియల్ నిర్మాణాలు సాగుతున్నాయి. మరోపక్క గెడ్డని కూడా కబ్జా చేస్తున్నా కనీసం పట్టించుకోకుండా లంచాల మత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు మునిగి తేలుతున్నారని స్థానిక రాజీవ్ గృహకల్ప నివాసులు ఆరోపిస్తున్నారు. బఫర్ జోన్లో షాపులు నిర్మాణంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. జాతీయ రహదారికి 30 అడుగుల దూరంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని నిబంధనలు ఉన్నాయి. అయితే వాటన్నింటిని తుంగలో తొక్కి ప్లాన్ లేకుండా అనధికారికంగా ఈ షాపుల నిర్మాణం జరుగుతుంది.

జోనల్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు అటూ వైపు కన్నెత్తి చూడకపోవడంపై తీవ్ర ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. జీవీఎంసీ నుండి ఎటువంటి అనుమతులు పొందకుండా ఖాళీ స్థలానికి విఎల్టి చెల్లించకుండా, జీవీఎంసీ ఆదాయానికి లక్షల్లో గండికోటి దర్జాగా ఓ పెద్ద షెడ్ నిర్మాణాన్ని అనధికారికంగా చేపడుతున్నారు. ఎవరైనా నిర్మాణం చేపట్టే ముందు జీవీఎంసీ నుండి పూర్తి అనుమతులు పొందిన తరువాత నిర్మాణాన్ని చేపడతారు.

కానీ ఇక్కడ జీవీఎంసీ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు పొందకుండా వీఎల్టిలు చెల్లించకుండా అక్రమ నిర్మాణాన్ని దర్జాగా చేపడుతున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టీడీపీ కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర - సాగర్ నగర్: జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో సాగర్ నగర్‌లో టిడిపి వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, కాటూరి వీర్రాజు ఆధ్వర్యంలో ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆదివారం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో ప్రచారం ముమ్మరం చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేత సారి పిల్లి శ్రీనివాసరావు, టిడిపి ప్రచార కార్యదర్శి బోడేపూడి దొరబాబు, చిన్న గోపి, బాబురావు, చెట్టుపల్లి సన్యాసిరావు, డబ్బాడ వెంకటరమణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డికి జీఎస్ఆర్ కృతజ్ఞతలు

విశాలాంధ్ర - గోపాలపట్నం: వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని స్వగృహంలో జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురలీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. గునిశెట్టి శ్రీనివాసరావుకు రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సత్కరించి, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి గునిశెట్టి శ్రీనివాసరావు (జి.ఎస్.ఆర్)ను అభినందించారు.

చెడ్డి గ్యాంగ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖ నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో కొంతమంది సభ్యులతో కూడిన చెడ్డి గ్యాంగ్ ముఠా తిరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విశాఖ నగర పోలీసులు హెచ్చరించారు. పద్మనాభం మండలం పరిధిలో చెడ్డి గ్యాంగ్ ముఠా సంచరించినట్లు పోలీసులు గుర్తించారు.

మధురవాడ, ఆనందపురం, గాజువాక, పెందుర్తి ప్రాంతాల్లో ఒంటరి ఇల్లే లక్ష్యంగా ఈ చెడ్డీ గ్యాంగ్ ముఠా దోపిడీలకు పాల్పడుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎలాంటి కదలికలు ఉన్న 100 నెంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని విశాఖ నగర పోలీసు కమిషనర్ కార్యాలయం తెలియజేసింది.

వంగవీటి రాధాను కలిసిన పరిమి భువనేశ్వరి

విశాలాంధ్ర - ఆనందపురం: జనసేన పార్టీ జీవీఎంసీ ఒకటో వార్డు అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి (తాతా రవి) బుధవారం విజయవాడలో వంగవీటి రాధా నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాల గురించి సుమారు 20 నిమిషాల పాటు చర్చించారు. 2024లో అధికారంలోకి రానున్నది మహా కూటమి అని తెలిపారు. భువనేశ్వరితో పాటు ఆమె కుమారుడు ప్రీతం కూడా ఉన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదుల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్రంలో జరగబోతున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి విశాఖపట్నం తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు స్వీకరించబడునని విశాఖ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నోడల్ ఆఫీసర్ (ఎం.సి.సి), జోన్-3 జోనల్ కమిషనర్ జె. విజయలక్ష్మి తెలిపారు. విశాఖపట్నం తూర్పు అసెంబ్లీ నియోజకవర్గమునకు సంబం ధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై జోన్ 3 కార్యాలయంలో ప్రత్యేకించి కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు, సంబంధిత ఫిర్యాదుల కొరకు 0891-2746314 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

గీతం ఎంబీఏ కోర్సులలో ప్రవేశాలు

విశాలాంధ్ర - మధురవాడ: గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా నిర్వహిస్తున్న ఎంబీఏ కోర్సులలో ప్రవేశాలకు గాను గీతం బిజినెస్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్ -2024 (జిబాట్)ను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. గీతంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. జిబాట్ -2024 ప్రవేశ పరీక్షను ఈ నెల 24వ తేదీన దేశ వ్యాప్తంగా 80 పట్టణాలలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. రెండు గంటల కాలవ్యవధి గల ఈ ప్రవేశ పరీక్ష 200 మార్కులకు ఉంటుందన్నారు. ఎంబిఎలో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్ సప్లైచైన్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రీసోర్స్, ఇంటర్నేషనల్ బిజినెస్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఎకౌంటింగ్ స్పెషలైజేషన్‌లను ఆఫర్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఎంబిఎ హెల్త్‌కేర్, హస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. విశాఖలోని ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్‌జోన్‌తో కలిసి ఈ కోర్సును రూపొందించి నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. డిగ్రీలో ఉత్తీర్ణులైనవారు ధరఖాస్తూ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 24వ తేదీన జరిగే గీతం అడ్మిషన్ టెస్ట్-2024కు ధరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ప్రవేశ పరీక్షలో లభించిన మార్కుల ఆధారంగా వ్యక్తిగత ఇంటర్వ్యూలను నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివిరాలకు గీతం వెబ్‌సైట్‌ను సందర్శించవలసిందిగా కోరారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ వెంకటేశ్వరులు, డాక్టర్.బంగారరాజు, ప్రొఫెసర్ పి.షీలా, జగదీష్, డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై చర్చకు సిద్ధమా!

జన సైనికులకు మెంటు మహేష్ సవాల్

విశాలాంధ్ర - పెందుర్తి: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు జీవీఎంసీ 97వ వార్డు పార్టీ అధ్యక్షుడు మెంటు మహేష్ స్పష్టం చేశారు. గతంలో మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ చేసిన అభివృద్ధి పనులపై చర్చకు రావాలంటూ జనసేన నాయకులు విసిరిన సవాల్‌పై ఆయన స్పందించారు. సుజాతనగర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఒక్క 97వ వార్డులోనే 13 కోట్ల నిధులతో 60కు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఎమ్మెల్యే అదీప్ రాజ్ కే దక్కుతుందని పేర్కొన్నారు. తాము చేసిన అభివృద్ధిని చూపించడానికి వైసిపి నాయకులు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం అటు సంక్షేమం ఇటు అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిందని వెల్లడించారు. ఎమ్మెల్యే అదీప్ రాజ్ చేసిన అభివృద్ధిపై చర్చించేందుకు ఎక్కడైనా తాను సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేస్తున్న అదీప్ రాజ్ 50 వేలకు పైగా ఓట్లు మెజారిటీతో విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ద్రోణి ప్రభావంతో అకాల వర్షాలు

ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ద్రోణి ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో బుధవారం విస్తారంగా వర్షాలు కురిసాయి. మార్చి మూడో వారంలో ఎండలతో మండి పోతున్న ప్రజలకు ఒక్కసారిగా ఉపశమనం లభించింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డా. బీఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో మంగళవారం నుండే విస్తారంగా వర్షాలు కొన్నిచోట్ల పడ్డాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ జిల్లాల్లో మోస్తరు వానలు కురిశాయి. ఉదయం నుండి విశాఖ నగరంలో చిరుజల్లులు కురవడంతో అనేక ప్రాంతాల్లో వరదమయం నెలకొంది. కొన్నిచోట్లగా భారీ వర్షాలు పడడం, మరికొన్నిచోట్ల ఎండ తీవ్రంగా ఉండడం విభిన్న వాతావరణం నెలకొంది. అనేకచోట్ల పంటలకు ఈ అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టాయి. కొన్ని ప్రాంతాల్లో భారీ ఈదురు గాలులకు అరటి తోటలో చెరుకు, జొన్నతో పాటు మిరప , నువ్వుల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

ఎన్నికల కమిషన్ అనుమతితోనే ప్రచారం జరగాలి

జిల్లా కలెక్టర్ ఏ.మల్లికార్జున

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఎన్నికల ప్రచారం, వ్యయం, వాహనాల అనుమతి తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఏ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డా. ఎ. రవిశంకర్, జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అవగాహన కల్పించారు. రాజకీయ పార్టీలు, సంఘాలు అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేశారు. స్థానిక వి.ఎం.ఆర్డి.ఏ. చిల్డ్రన్ ఎరీనాలో బుధవారం నిర్వహించిన సదస్సులో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రూ.50 వేలకు మించి నిధులు ఎవరి జేబులోను ఉండకూడదని తెలిపారు. వ్యక్తిగతంగా, సామూహికంగా ఉన్నా ఏభై వేలకు మించి డబ్బులు ఉండకూడదని చెప్పారు. ప్రచార సామాగ్రి ఖర్చులు విషయంలో కూడా జాగ్రత్త వహించాలని తెలిపారు. అదే విధంగా ప్రచార వాహనాలకు అనుమతి తప్పనిసరి అని చెప్పారు. ఇంటింటి ప్రచారానికి కూడా అనుమతులు తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణపై ప్రచారం చేయాలి

విశాలాంధ్ర - మల్కాపురం: ప్రకృతి వైపరీత్యాలు, పారిశ్రామిక వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి జాతీయ సేవా పథకం వాలంటీర్లు ప్రచారం చేయాలని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల యూనిట్ 1, 2ల ఆధ్వర్యంలో ఇందిరా కాలనీ, బర్మా కాలనీలలో నిర్వహిస్తున్న సేవా శిబిరాలను ఉద్దేశించి బుధవారం ఆమె మాట్లాడారు. వైపరీత్యాలు పట్ల అప్రమత్తంగా ఉంటే, ప్రాణ - ఆస్తి నష్టాలను నివారించగలమని అన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆహారం, నీరు, వసతి సౌకర్యాలను ఏర్పరచడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలని ఆమె అన్నారు. అనంతరం గ్రామీణ అభివృద్ధిలో యువత పాత్రపై ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి వ్యవహరించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జూనియర్ కళాశాల ప్రోగ్రాం అధికారులు ఎ.సంధ్యారాణి, నదియా పాల్గొన్నారు.

25న సింహాద్రప్పన్న పెళ్లి చూపులు

విశాలాంధ్ర - సింహాచలం: దేశ, విదేశాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల ఆరాధ్య దైవం, భక్తకోటి, ఇలవేల్పు అయిన శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి పెళ్లి చూపులు ఈనెల 25న జరగనున్నాయి. ఫాల్గుణ పౌర్ణమి రోజున ప్రతి ఏటా సాంప్రదాయ బద్ధంగా నిర్వహించే డోలోత్సవం ఈ ఏడాది కూడా ఆలయ వైదిక, అధికార వర్గాలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు వైదిక వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. వేదమంత్రోచ్ఛారణలు మృదుమధుర మంగళ వాయిద్యాల నడుమ సిరులొలికించే సింహాద్రి నాధుని కొండ దిగువకు మెట్లమార్గం వెంబడి పల్లకిలో నేరుగా స్వామి తన సోదరి అయిన శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. పెరుమాళ్ళు కొండక్రింద కొలువై ఉన్న తన సోదరి, అడవివరం గ్రామదేవత అయిన పైడితల్లమ్మ వారి వద్దకు మంది మార్బలంతో బయలుదేరి వెళతారు. కుమార్తెను మేము వివాహ మాడుటకు నిర్ణయించితిమి మీకు సమ్మతమేనా అని స్వామివారి తరుపున అర్చకులు అమ్మవారి తరుపున అర్చకులకు అడుగుగా ఇప్పుడేమి తొందర అని పైడితల్లమ్మ వారు స్వామితో అనగా స్వామివారు అలిగి పుష్కరిని సత్రంకు వెళ్తారు.

పల్లా విజయాన్ని కాంక్షిస్తూ పూజలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: సార్వత్రిక ఎన్నికల్లో గాజువాక నియోజక వర్గం నుంచి జనసేన - బీజేపీ మిత్రపక్షాలు బలపరిచిన టీడీపీ శాసన సభ అభ్యర్థిగా బరిలో దిగిన గాజువాక నియోజక వర్గ మాజీ శాసన సభ్యులు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అఖండ మెజారిటీతో విజయం సాధించాలని బాలచెఱువు శివాలయంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, దూడ సిరింహాచలం రెడ్డి, నాయకులు దొమ్మేటి అప్పారావు, నాయకులు ములకలపల్లి పెంటయ్య, పులి శ్రీరామ రెడ్డి, ఉరుకుటి వెంకటరావు, దొమ్మేటి పెరుమాళ్, దొమ్మేటి నాగరాజు, మొల్లి అప్పారావు, బస అప్పల రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్ ఓటమే ధ్యేయం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఓటమి ధ్యేయంగా పని చేస్తామని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి ముత్యాల రావు పేర్కొన్నారు. ఆమె బుధవారం డాబాగార్డన్స్‌లో గల విజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సంఘం ద్వారా గత మూడున్నరేళ్లుగా ఆందోళన చేసావని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా అసెంబ్లీ ముట్టడి చేశామని, ఇక మీదట గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్పంచులు, ప్రజలకు జరిగిన అన్యాయం వివరిస్తామన్నారు. ఒక పద్దు కింద రూ.నాలుగు వేల కోట్లు నిధులు బకాయి పెట్టిందని, రాష్ట్ర ప్రభుత్వం మొత్తం మీద 8,629 కోట్లు బకాయి వున్నారని తెలిపారు. అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ఆందోళనలు చేసామని, సంఘం ఆధ్వర్యంలో 16 డిమాండ్ల సాధనకు పోరాటం చేస్తున్నామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చింతకాయల ముత్యాలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 12 వేల 918 గ్రామ పంచాయితీలు వున్నాయి అని తెలిపారు. రాష్ట్రంలో 2021లో సిఎం జగన్ సచివాలయం వ్యవస్థ పెట్టి వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేశారని, ఇది పంచాయతీ రాజ్ వ్యవస్థ కి పూర్తి విరుద్ధం అని, 73,74 రాజ్యాంగ సవరణ ద్వారా సర్పంచ్ లకు అధికారాలు పునరుద్ధరించాలని కోరారు. ఛాంబర్ ఉపాధ్య క్షుడు వానపల్లి ముత్యాల రావు, సంఘం ప్రతినిధులు సోమేశ్వర రావు, అప్పల రాజు, అమ్మోరు పాల్గొన్నారు.

పెందుర్తి వైసీపీ రెబల్ అభ్యర్థిగా గుంటూరు...?

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంలోని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాపు నాయకుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి. అదీప్ రాజ్ అభ్యర్థిత్వాన్ని మార్చాలంటూ అధిష్టానాన్ని డిమాండ్ చేస్తున్నాయి. లేకుంటే పార్టీకి పనిచేయబోమని పలువురు నాయకులు బహిరంగంగానే స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వైసీపీ సీనియర్ నాయకులు గుంటూరు వెంకట నరసింహమూర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్ రాజ్ అభ్యర్థిత్వంపై తీవ్రస్థాయిలో మండి పడుతున్నారు. అవినీతిలో కూరుకుపోయిన అదీప్ రాజ్, వర్గ రాజకీయాలు నడుపుతూ సీనియర్ నాయకులను అవమానిస్తున్నారంటూ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఈనెల 25 లోగా అభ్యర్థిని మార్చి కాపులకు పెందుర్తి సీటు కేటాయించాలని లేకుంటే ఈ నెల 25న పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. పెందుర్తి సీటును తనకు కేటాయిస్తే భారీ మెజారిటీతో గెలిచి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కానుకగా ఇస్తామని ప్రకటించారు. కూటమి అభ్యర్థిగా కాపు సామాజిక వర్గానికి చెందిన పంచకర్ల రమేష్ బాబు బరిలో ఉన్నందున వైసీపీ కూడా కాపు వర్గానికే సీటు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేసారు. నియోజకవర్గంలో కాపులు అధిక సంఖ్యలో ఉన్నందున వారికి కాకుండా మరో వర్గానికి సీటు ఇస్తే పెందుర్తిలో వైసిపి ఓడిపోవడం ఖాయమని స్పష్టం చేశారు. తనతో పాటు అనేక మంది కాపు నాయకులు అదీప్ రాజ్ వ్యవహార శైలి పట్ల తీవ్ర ఆవేదనతో ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్థానిక సమస్యలపై సమగ్రంగా సర్వే చేయించి కాపు సామాజిక వర్గానికి చెందిన బలమైన అభ్యర్థిని ప్రకటిస్తారని ఆశిస్తున్నట్లు గుంటూరు వెంకట నరసింహమూర్తి ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం సరిగా స్పందించకపోతే వచ్చే ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా తాను బరిలో నిలుస్తానని స్పష్టం చేశారు. తనకు నియోజకవర్గంలోని కాపు నాయకు లందరూ మద్దతు ఇస్తారని వెల్లడించారు. అలాగే విశాఖ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోను వైసీపీ గెలుపునకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్ఎస్ఎస్ పీఓ పవన్‌కుమార్ అన్నారు. ఏక్యూజే కళాశాల నందు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా దత్తత గ్రామమైన ఆనందపురం మండలంలో పాలవలసలో ఓటరు చైతన్యం, ఓటు యొక్క శక్తి, ప్రజాస్వామ్యంలలో ఓటు ప్రాముఖ్యతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దక్షిణంలో కూటమి కుమ్ములాటలు

రెండు వర్గాలుగా జనసేన
మరో వర్గంగా టిడిపి
వర్గ పోరే వాసుపల్లికి అనుకూలంగా మారనుందా...?



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖలో దక్షిణ నియో జకవర్గంలో రాజకీయ ముఖచిత్రం వినూత్న రీతిలో మారింది. దక్షిణ నియోజకవర్గానికి టిడిపి కంచుకోటగా వస్తూనే ఉంది. 2014, 2019 ఎన్నికల్లో వరుసగా ఎమ్మెల్యేగా టిడిపి నుండి వాసుపల్లి గణేష్ కుమార్ గెలుపొందారు. రాష్ట్రమంతటా ఫ్యాన్ స్పీడు పెరిగినప్పటికీ, జగన్‌కు 151 యొక్క సీట్లు వచ్చినప్పటికీ, విశాఖలో ఉన్న నాలుగు నియోజకవర్గాలు టిడిపి ఖాతాలోకే జమయ్యాయి. టిడిపికి తూర్పు తర్వాత కంచుకోటగా దక్షిణం ఉంటుంది. టిడిపి నుండి గెలుపొందిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ వైసీపీలోకి జంపు కావడంతో ఈ నియోజకవర్గంలో టిడిపి క్యాడర్ కొంత వాసుపల్లితో వెళ్లిపోయింది. ఉన్న క్యాడర్‌ను కాపాడుకునేందుకు టిడిపి సంస్థాగతంగా బలోపేతం చేసిన గండి బాబ్జికి ఈ ఎన్నికల్లో టికెట్ దక్కకుండా పోయింది. దీంతో ఆయన టిడిపికి రాజీనామా చేసి వెళ్లిపోయారు. ప్రస్తుతం దక్షిణ నియో జకవర్గంలో టిడిపికి నాయకుడే లేకుండా పోయింది. వైసీపీకి రాజీనామా చేసి టిడిపిలో టిక్కెట్ ఆశించిన సీతంరాజు సుధాకర్ కూడా టిడిపి నుండి దక్షణం టికెట్ కోసం తీవ్రంగానే ప్రయత్నం చేశారు. ఈ నియోజకవర్గంలో తొలి నుండి జనసేన పార్టీలో టికెట్ ఆశిస్తున్న వారు కొంతమంది ఉన్నారు. వారిలో డాక్టర్ మూగి శ్రీనివాస్, కార్పొరేటర్లుగా ఉన్న కందుల నాగరాజు, మహమ్మద్ సాధిక్‌లు దక్షిణంలో జనసేన నుండి టికెట్లు రేసులో మొదటి నుంచి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అయితే వీరందరినీ కాదనుకొని టిడిపి జనసేన పొత్తులో భాగంగా ఇటీవల పార్టీలో చేరిన వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌కు జనసేన నుండి దక్షణం టిక్కెట్ ప్రకటించడంతో అటు జనసేనలో వర్గ పోరు, కుమ్ములాటలు, కొట్లాటలు ప్రారంభమయ్యాయి. బుధవారం 39వ వార్డులో జనసేనలో రెండు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఇటీవల జనసేన కార్పొరేటర్ సాదిక్ మీడియా సమావేశంలో వంశీ మాకొద్దు అంటూ ప్రకటించారు. ఇక టిడిపి లో కూడా వంశీ రాకను తీవ్రంగానే వ్యతిరేకిస్తున్నారు. యాదవ సామాజిక వర్గం ఉన్న వార్డుల్లో మాత్రమే వంశీ అభ్యర్థిత్వాన్ని అంగీకరిస్తున్నప్పటికీ, వన్‌టౌన్ ప్రాంతంలో అనేక వార్డుల్లో వంశీ అభ్యర్థత్వాన్ని అటు టిడిపి, ఇటు జనసేన తీవ్రంగానే వ్యతిరేకి స్తున్నాయి. ఈ కుమ్ములాటలు, వర్గ పోరు సిట్టింగ్ ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థిగా ఉన్న వాసుపల్లి గణేష్ కుమార్‌కు అనుకూలంగా మార్చుకునేందుకు ఆ పార్టీలో కొంతమంది కేడర్ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మరోపక్క వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ కూడా టిడిపితో ఆయనకున్న పదేళ్ల అనుబంధం కారణంగా అనేకమంది టిడిపి క్యాడర్‌ను తన వైపునకు తిప్పుకునేలా ప్రయత్నాలు మరింత తీవ్రతరం చేసినట్లు తెలుస్తుంది. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వాసుపల్లి అన్ని పార్టీల నుండి ఉన్నవారిని సమీకరించి తన గెలుపు కోసం పని చేసేలా వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ, దక్షిణ నియోజకవర్గంలో కూటమి మధ్య సఖ్యత లేకపోవడం, జనసేనలో రెండు వర్గాలుగా వర్గ పోరు తారాస్థాయికి చేరడంతో వంశీకృష్ణ పోటీపై కూటమి వర్గాల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర, గాజువాక నియోజకవర్గాల్లో కూటమి ఐక్యతగానే ఉన్నప్పటికీ దక్షిణ నియోజకవర్గంలోని తీవ్ర గందరగోళం ఏర్పడింది. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న గండి బాబ్జి రాజీనామా చేయడం, జనసేన రెండు వర్గాలుగా విడిపోయి వంశీ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడంపై కూటమి అభ్యర్థి గెలుపుపై నీలి మేఘాలు కమ్ముకున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆఖరి నిమిషంలో అభ్యర్థిత్వాన్ని మార్చే అవకాశం ఉందని తెలుస్తుంది. మళ్లీ రాజకీయ సమీకరణలు మారుతాయని, టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దక్షిణ నియోజకవర్గం లో ఉన్న పరిస్థితులను సద్దుమణిగాలా చర్చలు జరిపి నియోజకవర్గంలో ఉమ్మడిగా ఐక్య పోరాటానికి సిద్ధం చేయిస్తారని వంశీ వర్గీయులు అభిప్రాయపడుతున్నారు.

నియోజకవర్గ స్వరూపం ఇలా...

విశాఖ నగరానికి మొదటి నియోజకవర్గంగా ఉండే ఓల్డ్ సిటీ క్రమంగా నగరం విస్తరణ దిశగా జరిగింది. విశాఖ -1 నియోజకవర్గంగా 1952లోనే ఏర్పడింది. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా దక్షిణ నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. జీవీఎంసీలో 29 వార్డు నుండి 39 వార్డులు, 27,28, 41, 42 వార్డుల్లో కొంత భాగం ఈ నియోజకవర్గంలోకి వస్తుంది. నియోజకవర్గంలో మురికివాడలు అధికంగానే ఉన్నాయి. అధిక శాతం ఓటర్లు చేపల రేవు పైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2, 12, 783 మంది కాగా, మహిళలు 1,08, 254 ఉండగా, పురుషులు 1,04, 497 ఉన్నారు. ఇతరులు మరో 32 మంది ఓటర్లుగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన వాసుపల్లి గణేష్ కుమార్ కు 52,172 ఓట్లు రాగా, సమీప వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ద్రోణం రాజు శ్రీనివాస్ కు 48,443 ఓట్లు వచ్చాయి, ఇక్కడ గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన గంపల గిరిధర్‌కు కేవలం 18, 119 ఓట్లు మాత్రమే వచ్చాయి.

అందుబాటులో 'సి విజిల్' యాప్

100 నిమిషాల్లో ఫిర్యాదును పరిష్కరిస్తారు
ఎన్నికల అక్రమాలపై అందుబాటులోకి వచ్చిన యాప్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం రానున్న ఎన్నికలను సజావుగా జరిపేందుకు, అధునాతన సి విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే తాయిలాలు, ఎన్నికల కోడ్ ఉల్లంఘన, ఘర్షణలు, వినూత్న ప్రచారాలు పై ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసే యాప్ ను అందుబాటులోకి కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చింది. రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దిశా నిర్దేశం చేసే సార్వత్రిక ఎన్నికల(2024)కు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్) అమల్లోకి వచ్చేసింది. ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఈ నేపథ్యంలో అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వాటికి అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఇందులో పౌరులను సైతం భాగస్వాములను చేస్తోంది. 'సి విజిల్' యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. దాని గురించి తెలుసుకుని, నిబంధనలు ఉల్లంఘించే వారి పని పట్టండిలా..

అసలు.. ఏంటిది..?

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఈ 'సి విజిల్' యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని పౌరులు ఎవరైనా వినియోగించవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

రిజిస్టర్ చేసుకోండిలా:

ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం వారి 'సి విజిల్' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మీ చరవాణి నంబరు ద్వారా దానిలో రిజిస్టర్ చేసుకోవాలి. ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేస్తే 'సి విజిల్' యాప్ సిద్ధమైనట్లే. దాని ద్వారా మీరు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

ఎలాంటివి చేయవచ్చంటే:

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైనైనా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం. ఇలాంటి ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డ్ చేసి అప్‌లోడ్ చేయండి.

ఎలా చేయాలంటే:

మీ యాప్ తెరవగానే తెరపై 'ఫొటో', 'వీడియో', 'ఆడియో' అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. మీరు ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫొటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మీ లొకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోను అప్‌లోడ్ చేయండి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఇది ఎన్నికల సంఘానికి చేరుతుంది.

5 నిమిషాల్లో రంగంలోకి అధికారులు:

యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి 5 నిమిషాల్లో.. దానిని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి, 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సి విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది.

అడ్డుకట్ట వేయండి:

తాయిలాలు పంచి, అక్రమాలకు పాల్పడి అధికార పీఠం ఎక్కాలనుకునే అరాచక రాజకీయ పార్టీలకు ఈ యాప్ ద్వారా చరమ గీతం పాడొచ్చు. ఈ రోజే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘన కనిపిస్తే ఫిర్యాదు చేయండి. అక్రమాలకు అడ్డుకట్ట వేయండి. మీ పిల్లలు, రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసం, మీ వంతు బాధ్యతను నిర్వర్తించండి...

ఎంజి మోటార్, ఎస్ఏఐసి మోటార్, జేఎస్ డబ్ల్యూ గ్రూప్ మధ్య వ్యాపార రోడ్ మ్యాప్

విశాలాంధ్ర - విశాఖపట్నం: వ్యూహాత్మక సహకారం కోసం - జేఎస్‌డబ్ల్యూఎమ్‌జి మోటార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (జే ఎస్ డబ్ల్యూ ఎమ్ జి మోటార్ ఇండియా) వ్యాపార వ్యూహాన్ని ఆవిష్కరించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాయింట్ వెంచర్ భారతదేశం యొక్క వేగంగా రూపాంతరం చెందుతున్న ఆటోమోటివ్ ల్యాండ్ స్కేప్లో అభివృద్ధి చెందుతున్న సమృద్ధిగా ఉన్న అవకాశాలను ప్రభావితం చేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. జే ఎస్ డబ్ల్యూ ఎమ్ జి మోటార్ ఇండియా తన వ్యాపార ప్రయత్నాలలో అత్యాధునిక ఆవిష్కరణలను ఏకీకృతం చేస్తుందని చేస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, తయారీ సామర్థ్యాలను మెరుగుపరచడం, గణనీయమైన ఉద్యోగ సృష్టిని ప్రోత్సహించడం, కస్టమర్ సంతృప్తిపై బలమైన ప్రాధాన్యతతో తెలివైన మరియు స్థిరమైన ఉత్పత్తులను అందించడం కోసం అంకితం చేయబడిందన్నారు. సంస్థ యొక్క వ్యాపార రోడ్మ్యాప్ విస్తృతమైన స్థానికీకరణ ప్రయత్నాలకు దేశవ్యాప్తంగా స్థితిస్థాపకమైన ఆటోమోటివ్ పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుకు ప్రాధాన్యతనిస్తుందనీ వివారించారు.

జే ఎస్ డబ్ల్యూ ఎమ్ జి మోటార్ ఇండియా యొక్క కొత్త వ్యాపార రోడ్మ్యాప్ గణనీయమైన సంఖ్యలో ఉపాధి అవకాశాలను సృష్టించడం దేశంలో పెద్ద టాలెంట్ పూల్ను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తుందనన్నారు. ఈ చర్య స్థానిక కమ్యూనిటీలకు ప్రయోజనం చేకూరుస్తుందనన్నారు. అదనంగా కంపెనీ ఈవీలు, అటానమస్ మరియు కనెక్టెడ్ కార్ టెక్నాలజీలకు అవసరమైన నైపుణ్యంతో 1,00,000 మంది విద్యార్థులను నైపుణ్యం చేయడం, ఉద్యోగులను మెరుగుపరచడం కోసం పని చేస్తుందనీ వివరించారు.

సన్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో వైట్ కోట్ ఓత్ కార్యక్రమం

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్, దాట్ల కన్వెన్షన్ హాల్ నందు సన్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో వైట్ కోట్ ఓత్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ ఆచార్య. డాక్టర్ జి.బుచ్చిరాజు, కింగ్ జార్జ్ ఆసుపత్రి అసిస్టెంట్ సూపరిండెంట్ డాక్టర్ వాసుపల్లి రవి, సన్ కాలేజ్ సిఎండి జి.తేజస్విని చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ వైద్య రంగంలో పారామెడికల్ ఫిజియోథెరపీ పాత్ర కీలకమైనదని రోగ నిర్ధారణ, నివారణలో కూడా అత్యంత కీలక పాత్ర పోషించడంలో ఈ రెండు గ్రూపులు ముఖ్యమైనవని తెలిపారు. వైద్య వృత్తిలో ఎటువంటి స్వార్థ ప్రయోజనాలు ఆశించకుండా నిజాయితీ నిబద్ధతతో పనిచేయాలంటూ విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ కోర్సుల మీద గతంలో విద్యార్థులకు అవగాహన లేకపోయినా ఇప్పుడిప్పుడే అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో దేశ విదేశాల్లో పారామెడికల్ ఫిజియోథెరపీ కోర్సుల్లో చేరినవారికి మరింత ఉపాధి అవకాశాలు కలిగే అవకాశం ఉందని తెలిపారు.

2024-25 కోసం 'విమెన్ ఇన్ స్టెమ్'
స్కాలర్‌షిప్‌లను ప్రారంభించిన బ్రిటిష్ కౌన్సిల్

విశాలాంధ్ర- విశాఖపట్నం : యుకె విద్యా అవకాశాలు, సాంస్కృతిక సంబంధాల కోసం అంతర్జాతీయ సంస్థ, బ్రిటీష్ కౌన్సిల్, యుకె విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో స్టెమ్ ప్రోగ్రాంలలోని మహిళల కోసం బ్రిటిష్ కౌన్సిల్ స్కాలర్‌షిప్‌లను ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక స్కాలర్‌షిప్ యుకెలో తమ మాస్టర్స్‌ను అభ్య సించాలనుకునే మహిళా స్టెమ్ గ్రాడ్యుయేట్ల కోసం రూపొందిం చబడిందన్నారు. భారతదేశం, ఇతర దక్షిణాసియా దేశాల నుండి మహిళా స్టెమ్ స్కాలర్‌ల కోసం 25 స్కాలర్‌షిప్‌లు రిజర్వ్ చేయబడ్డాయన్నారు.

ఇవి ఐదు యుకె ఉన్నత విద్యా సంస్థలు - క్వీన్ మేరీ విశ్వవిద్యాలయం లండన్, ఆంగ్లియా రస్కిన్ విశ్వ విద్యాలయం, గ్రీన్విచ్ విశ్వవిద్యాలయం, సౌతాంప్టన్ విశ్వ విద్యాలయం, కోవెంట్రీ విశ్వవిద్యాలయం లో అందుబాటులో ఉంటాయనీ చెప్పారు. ఈ స్కాలర్స్ డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, ఫార్మాస్యూటికల్ సైన్స్, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ మేనేజిమెంట్, సివిల్ ఇంజనీరింగ్ మేనేజిమెంట్, ఇంటెలిజెంట్ హెల్త్‌కేర్, యాక్చు రియల్ సైన్స్ వంటి కోర్సులను అభ్యసించవచ్చన్నారు. బ్రిటీష్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ ఇండియా డైరెక్టర్ రిత్తికా చందా పర్రుక్ ఎంబీఈ మాట్లాడుతూ "ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను సైన్స్ పరిశోధనల ద్వారా మాత్రమే పరిష్కరించవచ్చన్నారు. అర్హత ప్రమా ణాలు లేదా యుకె విశ్వవిద్యాలయాల పూర్తి జాబితా, అందు బాటులో ఉన్న కోర్సులు విశ్వవిద్యాలయ-నిర్దిష్ట గడువులతో సహా ఇతర సమాచారం గురించి మరిన్ని వివరాల కోసం, దయచేసి తమ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - ఆనందపురం: ఎన్నికలు జరిగే ప్రక్రియ దృష్ట్యా మహిళా పోలీసులందరూ ఆయా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పలు జాగ్రత్తలు వహించాలని విశాఖ నార్త్ సబ్ డివిజన్ ఏసిపి డి.సునీల్ తెలిపారు. బుధవారం ఆనందపురం సిఐ తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి అలాగే ఎన్నికల సమయంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారాన్ని అందించాలన్నారు. ఎన్నికల విధులు సమయంలో పలు జాగ్రత్తలు వహించి శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగించినట్లయితే సమాచారం మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది అందుబాటులో ఉంటారని తద్వారా స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌కు సమాచారాన్ని అందించాలని ఏసిపి బి. సునీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ టీవీ తిరుపతిరావు, సబ్ ఇన్స్పెక్టర్ గంట్యాడ సంతోష్, గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి జావా యెజ్డీ మోటర్‌సైకిల్స్ మెగా సర్వీస్ క్యాంపు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జావా యెజ్డీ మోటర్‌సైకిల్స్ తమ అత్యంత విజయవంతమైన మెగా సర్వీస్ క్యాంప్‌ను ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంకు విస్తరించింది. పలు రాష్ట్రాల వ్యాప్తంగా అనేక విజయవంతమైన సేవా శిబిరాలను నిర్వహించిన తర్వాత, మూడు రోజుల ఈవెంట్ విశాఖపట్నంలో మార్చి 22 నుంచి మార్చి 24 వరకూ జరుగనుంది, ప్రత్యేకంగా ఈ ప్రాంతంలోని 2019 2020 మోడల్‌ల జావా మోటర్‌సైకిల్ యజమానులకు సేవలు అందించబడతాయి. ఈ సేవా శిబిరం ఆంధ్రా మోటార్స్ - డోర్ నెంబర్ 52-10-6, రేసపువానిపాలెం, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం పక్కన, విశాఖపట్నం- 530016లో నిర్వహించబడుతుంది. ఈ శిబిరంలో భాగంగా, 2019-2020 జావా మోటర్‌సైకిళ్ల యజమానులు సమగ్ర వాహన తనిఖీకి మరియు ఎంపిక చేసిన విడిభాగాలను ఉచితంగా పొందడానికి అర్హులు. మోతుల్, అమరాన్ మరియు సియట్ టైర్‌లతో సహా ప్రముఖ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ సప్లయర్‌లు కస్టమర్‌లకు సహాయం చేయడానికి చురుకుగా పాల్గొంటాయి.

నేటి నుంచి డీఆర్‌ఎం కప్ వాలీబాల్ టోర్నీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: డీఆర్‌ఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ వాల్తేరు రైల్వే వాలీబాల్ గ్రౌండ్‌లో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మనోజ్ కుమార్ సాహూ, ప్రవీణ్ భాటీ, బి. అవినాష్, మోహనరావు, శ్రీరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ఎక్స్ఛేంజీల ద్వారా గెయిల్ విస్తరణ ప్రణాళికలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశం తమ సహజవాయువు వాటాను 6 శాతం నుండి 15 శాతంకి పెంచాలనే 2030 లక్ష్యాన్ని సాధించడంలో దేశంలోని దక్షిణ ప్రాంతంలో సహజ వాయువు మౌలిక సదుపాయాల అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తుంది. గెయిల్ యొక్క ధబోల్-బెంగుళూరు కొచ్చి-కూటటానాడ్-మంగ్లూర్-బెంగుళూరు పైప్‌లైన్‌లు వంటి క్లిష్టమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక మరియు కేరళ వంటి రాష్ట్రాలలో గ్యాస్ గ్రిడ్‌ను చురుకుగా విస్తరించాయి. అదనంగా, ఐఓసి యొక్క ఎన్నూర్-టుటికోరిన్ గ్యాస్ పైప్‌లైన్ త్వరలో ప్రారంభించబడుతుందని భావిస్తున్నారు, ఇది దేశంలోని దక్షిణ భాగంలో గ్యాస్ వినియోగాన్ని మరింత పెంచనుంది. ఈ విస్తరణ దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక కేరళలో సహజవాయువును పొందేందుకు విస్తృత స్థాయి అవకాశాలను అందిస్తుంది.

అభయాంజనేయ స్వామి విగ్రహ యంత్ర శిఖర ప్రతిష్ట

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో కనమాం గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ యంత్ర శిఖర ప్రతిష్ట మహోత్సవములు ఘనంగా జరిపారు. ముందుగా కోలాటం డ్రమ్స్, రామ భజనలతో, తిరువీధి మహోత్సవం ఉత్సవ విగ్రహం, పంచగవ్య ప్రాసన దీక్షాధారణ యాగశాల ప్రవేశం మొదలగు కార్యక్రమాలను గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి విశాఖ ఉత్తరం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు విచ్చేసి స్వామి వారు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని దర్శించుకున్నారు. ఆలయం వద్ద సుమారు 3500 మంది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆబోతుల అప్పల రాము, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు సురేందర్ రెడ్డి, చిక్కాల విజయబాబు, చందవరపు కుమార్, ఎర్ర రాము, కనమాం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'స్ప్లాష్' విజేతగా విశాఖ విద్యార్థిని అక్షిత

విశాలాంధ్ర - విశాఖ సిటీ: దేశవ్యాప్తంగా ఏడు నుంచి 14 ఏళ్ల బాలలకు యాక్సిస్ బ్యాంకు నిర్వహించిన వార్షిక ఆర్ట్, క్రాఫ్ట్ సాహిత్య పోటీ 'స్ప్లాష్' విజేతగా విశాఖపట్నంకి చెందిన ప్రెసి డెన్షియల్ స్కూల్ విద్యార్థిని అక్షిత నిలిచారు. ఈ పోటీలకు సంబంధించి మొత్తం ఆరుగురు విజేతలుగా నిలిచారు. వీరికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున స్కాలర్‌షిప్‌లతోపాటు భాగస్వాములైన హ్యామ్‌లీస్, ఫేబర్ క్యాజిల్, అమెరికన్ టూరిస్టర్, బోట్ వంటి సంస్థల నుంచి ఆకర్షణీయమైన హ్యాంపర్లు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ లభిస్తాయని యాక్సిస్ బ్యాంకు ప్రతినిధి అనూప్ మనోహర్ చెప్పారు. రన్నర్స్ అప్‌లకు తలో రూ.50 వేల బహుమతి లభిస్తుందన్నారు. ఏడు నుంచి పదేళ్ళ విభాగంలో ఆర్ట్‌లో న్యూఢిల్లీ చెందిన శివాష్ సోనీ, క్రాఫ్ట్‌లో తమిళనాడుకు చెందిన యశస్వి ప్రేమ్‌కుమార్, సాహిత్యంలో మహారాష్ట్ర నుంచి క్రితికా రెడ్డి విజేతల కాగా, పదకొండు నుంచి 14 ఏళ్ల గ్రూప్‌కి ఆర్ట్‌లో విశాఖ నగరానికి చెందిన వి.అక్షిత, క్రాఫ్ట్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన దేవాయుధ్ దాస్, సాహిత్యంలో పంజాబ్ నుంచి స్తుతి జైన్ విజేతలుగా నిలిచారన్నారు. దేశవ్యాప్తంగా ఈ పోటీకి 6.8 లక్షల మంది నుంచి ఎంట్రీలు వచ్చాయని తెలిపారు.

చెడ్డి గ్యాంగ్ ముఠాతో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - భీమిలి: విశాఖ సిటీ పరిధిలో చెడ్డీ గ్యాంగ్ ముఠా సంచరిస్తున్నారని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని భీమిలి క్రైమ్ ఎస్సై సూర్య ప్రకాష్ అన్నారు. భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో ప్రజలకు చెడ్డి గ్యాంగ్ ఫోటోలు ఉన్న ప్లకార్డులను చూపిస్తూ అవగాహన కల్పించారు. ఇంట్లో మనుషులు ఉన్నప్పటికీ ఏమాత్రం బెదరకుండా ఇంట్లోకి ప్రవేశిస్తారని ఎవరైనా అడిగితే వారిపై దాడులు సైతం చేయగలరని అన్నారు. పద్మనాభంలో ఇలాంటి వారు చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. వీరిని ఎవరైనా గుర్తిస్తే వెంటనే 7382541999, 8331041655 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. అంతే కాకుండా సైబర్ నేరాలు జరుగు తున్నందున హెల్ప్ లైన్ నెంబర్లు 1930కు ఫోన్ చేయాలని చెప్పారు. ఈ నెంబర్లు మొబైల్ ఫోన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.